క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


డి.సింహాచలం

రామభద్రపురం: మండల హౌసింగ్ ఏఈగా దత్తి సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన వై. సత్యారావునాయుడు పదవీ విరమణ కావడంతో బొబ్బిలి మండల హౌసింగ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న సింహాచలం బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో గ్రామదేవత అసిరితల్లి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు కొబ్బరికాయ కొట్టి, నిర్మాణ పనులను ప్రారంభించారు. గతంలో ఉన్న పాత ఆలయాన్ని పడగొట్టి, ఆ స్థానంలో అత్యంత సుందరంగా అమ్మవారి ఆలయం నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని చిన్నపుర్లి గ్రామంలో నవదుర్గామాత ఆలయ ఆరో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న భక్తులు దుర్గాదేవికి ప్రత్యేకాభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ స్థల దాతలు పాలవలస ప్రభాకరరావు, లక్ష్మీనారాయణ దంపతులు, ఆలయ ధర్మకర్తలు వాన వాసు, సత్యవతి దంపతులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో సిబ్బంది


వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ కె.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపట్టి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

బొబ్బిలి: పట్టణంలోని కోటి చెరువులో జరుగుతున్న ఆక్రమణలు తొలగించాలని అఖిలపక్ష నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, ముద్దల శ్రీనివాసరావు, సునీల్ కుమార్, రాకోటి నాగమ్మ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రాత్రివేళ కొంతమంది ఆక్రమణదారులు చెరువు లోతట్టు ప్రాంతానికి గ్రావెల్ తరలించి, చదును చేసి, ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి, చెరువు హద్దులు నిర్ణయించేలా చర్యలు తీసుకుని, ఆక్రమణలు అడ్డుకోవాలని కోరారు.

వీఏఏలకు ఒక్కరోజు శిక్షణ


వీఏఏలకు సూచనలిస్తున్న ఏడీఏ చంద్రరావు

రాజాం సిటీ: రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించే విషయమై, స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్)లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఏడీఏ కె.చంద్రరావు మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ప్రతీ గ్రామంలోని రైతులకు ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతుల అభిరుచులు, నేలసారానికి అనుగుణంగా విత్తనాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. ఏ రకమైన విత్తనాలు, ఏ రకమైన నేలలో వేస్తే ప్రయోజనం ఉంటుందో రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాలాడ గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అన్ని వర్గాలు బాగుండాలన్నదే వైఎస్సార్ సీపీ ధ్యేయమని, అందుకే పార్టీ పదవుల దగ్గర నుంచి క్యాబినెట్ వరకు అందరికీ సమన్యాయం కల్పించడం జరిగిందన్నారు. సంక్షేమంలో కూడా అదే తీరు అని, ప్రతీ ఇంటికి లబ్ధి జరిగేలా పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ముఖ్యమంత్రి జగనన్న తన పాదయాత్ర మొదలుకుని, ప్రజాసంకల్పయాత్ర వరకు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్న గొప్పతనం కూడా ఆయనదేనన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ సర్కారుపై కావాలనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు అండ్ కో శతవిధాలా ప్రయత్నిస్తున్నారని, మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు మరోసారి సిద్ధమవుతున్నారని అయితే వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయభేరి మోగించడం ఖాయమని, సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ఎస్.జగన్‌మోహన్‌రావు, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, సర్పంచ్ వి.గౌరి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు జి.కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీటీసీలు ఆర్.రమణ, వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం కావాలి

- చీపురుపల్లి డీఎల్‌డీఓ వి.లక్ష్మణరావు


మాట్లాడుతున్న చీపురుపల్లి డీఎల్‌డీఓ లక్ష్మణరావు

తెర్లాం: బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని చీపురుపల్లి డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఐసీడీఎస్, వైద్య శాఖ అధికారులు, సచివాలయ మహిళా పోలీసులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సఖి మండల స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. కిశోరి బాలికలంతా సఖి గ్రూపుల్లో చేరేలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు కృషి చేయాలని, అలాగే వారికి గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, దిశ, పోక్సో చట్టాలపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. 18 ఏళ్ల వయసు నిండకుండా బాలికలు వివాహం చేయడం ద్వారా కలిగే అనర్థాలను బాలికల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాడంగి ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా గ్రామాల్లో బాల్యవివాహాలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నామని, అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంఈఓ జె.త్రినాధరావు, తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యాధికారులు దీక్షితారాణి, వెంకటేష్, తెర్లాం, లోచర్ల ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- మండల ప్రత్యేకాధికారి బి.సుధాకర్


అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధాకర్

రాజాం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల పంపిణీ చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి బి.సుధాకర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు, మండలంలోని పలు శాఖల అధికారులతో శనివారం సమావేశమైన ఆయన అభివృద్ధి, సంక్షేమంపై సమీక్షించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు(పథకాలు) అర్హులకే అందేలా చూడాలన్నారు. అలాగే ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, మురుగుకాలువ ఉండాలన్నారు. కంచరాం దగ్గరి జగనన్న లే-అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించాలన్నారు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయం వంటి ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే విత్తనాలు సిద్ధం చేసి, సకాలంలో రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఏఈ రత్నాకర్, మెప్మా టీఎంసీ రత్నం, హౌసింగ్ ఏఈ రాజగోపాల్, ఎంపీడీఓ బి.శంకరరావు, పీఆర్ జేఈ ప్రభాకరరావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ అధికారి రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు పరిష్కరించండి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు

తెర్లాం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబర్-1902కు వచ్చిన ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శనివారం సమావేశమైన ఆయన ప్రజాసమస్యల పరిష్కారం, వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. చెత్తశుద్ధి కేంద్రాలు లేని గ్రామాల్లో వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులంతా సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. మండలంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను శతశాతం సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు, ఐసీడీఎస్ బాడంగి పీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయండి

హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించిన మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు అక్కడి జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలకు ప్రభుత్వం కలిపిస్తున్న సదుపాయాలు వివరించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. సామూహిక గృహప్రవేశాలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, గడువులోగా నిర్మాణాలు పూర్తి చేస్తే అది సాధ్యమవుతుందని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: జగనన్న కాలనీ ఇళ్ల పరిశీలనలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, హౌసింగ్ డీఈ అప్పయ్య, ఎంపీడీఓ రామకృష్ణ


బాడంగి: తెంటువలసలో హౌసింగ్ డే కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యశోదనరావు


రాజాం: మారేడుబాకలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


సంతకవిటి: జీఎన్‌పురంలో హౌసింగ్ డే కార్యక్రమం

నిత్యన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న సిద్ధార్థ

రేగిడి: మండలంలోని వావిలవలస నిత్యన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. ఇదే గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ దాతల సహకారంతో 25 మంది అనాథ వృద్ధులకు దాదాపు 1302 రోజులుగా అన్నదానం చేస్తూ తనలోని మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ


రైతులకు నవధాన్యాల విత్తనాలు అందిస్తున్న వ్యవసాయాధికారిణి రేణుకాసాయి

రాజాం: మండలంలోని గార్రాజుచీపురుపల్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు నవధాన్యాల విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై దాదాపు 30 రకాల నవధాన్యాల విత్తనాలను అందజేసినట్లు వ్యవసాయాధికారిణి రేణుకాసాయి తెలిపారు. వీటిని ఖరీఫ్‌కు ముందు పొలాల్లో దుక్కి చేసి, పండించాలని, ఆ తర్వాత ఈ పంటను ఖరీఫ్ దుక్కిలో దున్నేయడం ద్వారా భూసారం పెరిగి, అధిక దిగుబడులు వస్తాయన్నారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత

బాడంగి: విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన రాములమ్మకు ఆ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దేవరాజ్ స్వయంగా ఆస్పత్రికి వెళ్లి, శనివారం పెన్షన్ అందజేశారు. ఈ మేరకు ఆయన సేవలను అందరూ అభినందిస్తున్నారు.

రాజాం సిటీ: మండలంలోని ఇప్పిలిపేటకు చెందిన వలంటీర్ ధర్మాన ఆదిలక్ష్మి తన ఔదార్యం చాటుకుంది. గ్రామానికి చెందిన ఇప్పిలి అప్పలనాయుడు అనారోగ్యంతో విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అతడి వద్దకు ఆమె వెళ్లి, పెన్షన్ అందజేశారు.

రాజాం/సంతకవిటి: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఉర్లాపు దమయంతికి సంతకవిటి మండలంలోని కాకరాపల్లికి చెందిన వలంటీర్ లోపింటి హంసదేవి శనివారం ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేశారు.

మెంటాడ: అనారోగ్యంతో విజయనగరం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మీసాలపేటకు చెందిన ఉప్పాడ వీరభద్రుడు వద్దకు వలంటీర్ అభిరామ్ శనివారం వెళ్లి పెన్షన్ అందజేశారు.

డ్వాక్రా స్వయం సమృద్ధి యూనిట్ ప్రారంభం

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్వాక్రా స్వయం సమృద్ధి యూనిట్‌ను పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు శనివారం ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే వారిని అన్ని విధాలా అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి యూనిట్‌లో పేపర్ ప్లేట్, పిండి, రైస్, రుబ్బు మెషిన్లు ఉన్నాయని, వాటి ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కోమటిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు వి.శ్రీరాములు, సర్పంచ్ బొద్దల పద్మ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో నాడు-నేడు పనుల పూర్తి

వంగర: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.నూకరాజు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన మండలంలోని 13 పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలల నిర్మాణంతో పాటు, జరుగుతున్న చిన్నాపెద్ద మరమ్మతులను పాఠశాలల పునఃప్రారంభానికి పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, పంచాయితీరాజ్ ఏఈ ఆనందరావు, హౌసింగ్ ఏఈ పైడితల్లి, ఎంఈఓ వై.దుర్గారావు, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాధ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పథకాల కొనసాగింపు


లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

తెర్లాం: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న పథకాల కొనసాగింపు ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నెమలాం గ్రామంలో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, నవరత్నాల పథకాలతో పాటు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా గడిచిన నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో డీబీటీ విధానం ద్వారా జమ చేశారని పేర్కొన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల సిఫార్సు మేరకే అందేవన్నారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ కుటుంబానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే జగనన్న సర్కారు పారదర్శక పాలనకు నిదర్శమన్నారు.

మున్ముందు కూడా ఇవే పథకాలు ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి జగనన్ననే సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు పార్టీ సీనియర్ నాయకులు బి.అప్పలనాయుడు, టి.సత్యంనాయుడు, నెమలాం సర్పంచ్ ఎం.నరసింహులు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి యశోదనరావు

బాడంగి: మండలాన్ని ప్రగతి పథంలో నడిపించాలని, దీనికి అధికారుల సహాయ, సహకారాలు అవసరమని మండల ప్రత్యేకాధికారి ఎం.యశోదనరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో శనివారం సమావేశమైన ఆయన మండల ప్రగతిపై సమీక్షించారు. హౌసింగ్ ఏఈ సత్యం మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,490 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 925 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఖరీఫ్ సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నామని ఏఓ శిరీష తెలిపారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ ప్రవీణ్ అన్నారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ మోటార్లు, ఇళ్లకు మీటర్లు, వీధిలైట్లు ఏర్పాటు చేశామని విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు వెల్లడించారు. ఉపాధి పనుల్లో భాగంగా కంకర రోడ్లు వేస్తున్నామని ఏపీఓ లక్ష్మీపతిరాజు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అక్కారావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యం


ఇంటింటికీ వెళ్లి, వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రేగిడి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటికే వైద్యసేవలు అందుతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు కోరారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పలువురికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విరామకాలం సద్వినియోగం చేసుకోవాలి


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

రామభద్రపురం: వేసవి సెలవుల నేపథ్యంలో దొరికే విరామకాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సత్యవాణి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించడంతో పాటు కథలు చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించడం, వివిధ ఆటల పోటీలు నిర్వహించి, వారిలో క్రీడాప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడం వంటివి శనివారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల తరగతులు లేని ఖాళీ సమయాల్లో మెదడుకు పదునుపెట్టే ఫజిల్స్, మెదడుకు మేత వంటి ఆటలు ఆడాలన్నారు. సృజనాత్మకత పెంపొందే విద్యాక్రీడలపై దృష్టిసారించాలన్నారు.

వలంటీర్లకు సన్మానం


సన్మాన గ్రహీతలతో మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి:

వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక 21, 22వ వార్డుల్లోని వలంటీర్లను మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు శనివారం సన్మానించారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ టి.పార్వతి, కౌన్సిలర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.